# అందుకోలేనిది

పాండ్రంకి సుబ్రమణి



రామశేషానికి శంషాబాద్ విమానాశ్రయంలో దిగడం అదే మొదటిసారి. మునుపటి బేగంపేట విమానాశ్రయానికి, ఇప్పటి రాజీవ్‌గాంధీ విమానాశ్రయానికీ మధ్య పోలికే లేదనిపించింది. హంగులు, సొబగులూ చూస్తుంటే యూరప్‌లోని ఎయిర్‌పోర్టులను తలదన్నేలా ఉంది. ప్రపంచ దేశాల మధ్య నిటారుగా నిల్చునేలా ఉంది. అతడిలో ఇసుమంత గర్వం పొడసూపింది.

భార్య మనోహరిని, కూతురు వత్సలనూ వెంటబెట్టుకొని, పేరంటాల తంతు వంటి సెక్యూరిటీ క్లియరెన్స్ పూర్తిచేయించుకొని లాంజ్‌లోకి వచ్చేటప్పటికి గంటకుపైగా అయింది. ఈ వ్యవధానం కంటగింపుగా తోచింది.

అతడనుకున్నట్లే జరిగింది.పార్వతీశం జాడ ఎక్కడా కనిపించలేదు. మేనల్లుడికి తన రాక గురించి ఖచ్చితమైన భోగట్టా యివ్వలేకపోయాడు. కారణం - గొలుసుకట్టుగా తీసుకున్న ఎయిర్‌టిక్కెట్లు సమయానికి ఖరారు కాలేదు. ఈ లోపల సంగీతకచేరీలు వెతుక్కుంటూ పార్వతీశం పొరుగూళ్లకు చెక్కేసి ఉంటాడు. అయితే కొడుక్కి బదులు నారాయణి యిరుగుపొరుగు వాళ్లనెవరినైనా తోడ్కొనిరావచ్చు. కానీ బంధువుల్ని దిగీదిగిన వెంటనే ఎదురెళ్లి పలకరించడం చెల్లి ఎప్పుడో మానుకుంది. ఒక వితంతుస్త్రీ అలా ప్రత్యుత్థానం చేయడం తగని కార్యమని నారాయణి విశ్వాసం. ఆ సాంప్రదాయపు పరిధి నుంచి ఇటు ఆకాశం వెలుగులోకి రప్పించడం తలకుమించిన పనేనని అతడికి తెలుసు.

ప్రీ-పెయిడ్ క్యాబ్ మాట్లాడుకొని, కుటుంబ సమేతంగా చిక్కడపల్లి గ్రంథాలయం వీధిలో ఉన్న చెల్లి యింటి ముందు దిగాడు రామశేషం. క్యాబ్ లోపలినుంచి, పైన టాప్‌నుంచీ సామానంతా దింపుకొని, ఓసారి యింటి వాకిటివైపు చూపు సారించాడు! ఉన్నపాటున పాత జ్ఞాపకాల తరంగాలలో కొట్టుకుపోయాడు. బామ్మర్ది బ్రతికున్న రోజుల్లో మంది రాకపోకలతో యిల్లు ఎంత సందడిగా ఉండేదని!? మనోహరిని పెళ్లి చేసుకునేంత వరకూ తను కూడా ఇదే యింట్లో చెల్లీ బామ్మర్దులతోనే ఉండేవాడు - నారాయణగూడలో కాంట్రాక్టు ఉద్యోగం చేసుకుంటూ. అప్పటిలాగే యిప్పుడు కూడా పచ్చటిచెట్లు - పూలమొక్కలు ఏపుగా పెరిగి ఉన్నాయి. వెన్నెల రాత్రప్పుడు చెల్లీ, బామ్మర్దీ కూర్చొని ఊసులాడుకునే ఊయల మాత్రం కనిపించలేదు. మల్లె పందిరి లేని తోట - బొట్టులేని స్త్రీ ముఖంలా తోచింది అతనికి.

నారాయణి ఎలాగూ అప్పటికప్పుడు ఎదురవదు కాబట్టి రామశేషు భార్యాకూతుళ్ల వత్తాసుతో సామాను వాకిట ముందు పేర్చి, డోర్‌బెల్ నొక్కాడు. చీరచెంగు ఒంటినిండా కప్పుకుంటూ వచ్చి "ఎవరదీ?" అని పీపింగ్ హోల్ ద్వారా బయటకు చూసి, గోడ ఓరకు తప్పుకుంది నారాయణి - తలుపుతీసి. అలా ఓరన నిల్చునే అన్నయ్యను ఆప్యాయంగా పలకరించింది.

"వచ్చావురా అన్నయ్యా! పార్వతీశం మీ కబురుకోసం వారం రోజులపాటు ఎదురుచూసి మొన్ననే కాంచీపురం వెళ్లాడు" అలా పలకరిస్తూనే మేనకోడలి వైపు ఒదిగి చూసింది. "అబ్బా! ఎంత ఎదిగిపోయావే వత్సలా! పెరట్లోని ఉసిరి చెట్టులా ఉన్నావిప్పుడు. రెండు కళ్లూ చాలడం లేదనుకో! అదేదో అమెరికన్ బ్యాంకులో పెద్ద ఉద్యోగమే చేస్తున్నావటగా! అది చెప్పి మీ బావ తెగ మురిసిపోతాడనుకో" వత్సల బదులివ్వకుండా వెళ్లి మేనత్త రెండు పాదాలనూ తాకి నమస్కరించింది. ఆ మన్ననకు నారాయణి మనసు పులకరించింది.

కూతురి వెన్నంటి మనోహరి కూడా రావడం గమనించి "అక్కడే ఆగండి వదినా! ముం

దు ఏడుకొండల వాడికి నమస్కరించి లోపలికి వెళ్లండి" అంది.

మనోహరి అదేమీ లక్ష్యపెట్టకుండా ఆడపదుచుని సమీపించి,"ఎలాగున్నావు నారాయణీ!" అంటూ కౌగలించుకుంది. "నాకేమొచ్చిందిలే, వదినా! సానకల్లులా వున్నాను. మరి ఎటొచ్చీ నువ్వే పీలగా తయారయ్యావు ఎందుకోమరి!

అప్పుడు రామశేషం "అక్కడి వ్యవహారాలు, తీరూ నీకు తెలీదేమో నారాయణీ! కాడలా వేలాడుతూ నడవడం అక్కడొక పెద్ద ఫ్యాషన్" అన్నాడు నవ్వుతూ.

"ఇక్కడ మాత్రం ఏమిగానులేరా అన్నయ్యా – టీవీలో చూస్తూనే ఉన్నాగా – సన్న తీగెలా కనిపించడానికి మన ఊరి అమ్మాయిలు పడుతున్న తాపత్రయం" నారాయణి అలా ఓ విధంగా రాగంతీసి చెప్పడం చూసి తల్లీకూతుళ్లు నవ్వకుండా ఉండలేకపోయారు.

* * *

స్నానపానాదులు ముగించి, లోగిలి మధ్య ముగ్గురాడాళ్లూ కుదురుగా కూర్చొని కబుర్లాడటంలో మునిగిపోవడం గమనించి రామశేషం చప్పుడు లేకుండా పార్వతీశం గదిలోకి ప్రవేశించాడు.

కుడిఎడమనున్న రెండు తంబూరాలు చప్పున కళ్లువిప్పి చూస్తున్నట్లనిపించి ఆగిపోయాడు. మెత్తదిబ్బపైన ఉంచిన వీణ విశ్వసంగీత వేదికపై హుందాగా కూర్చొని సప్తస్వరాలను పలికించే సంగీత సరస్వతిలా కనిపించింది. సంగీతఝురికి వాద్యసహకారం అందివ్వడానికి సిద్ధంగా కూర్చున్నట్లుంది మృదంగం. శివతాండవానికి ముందొచ్చే ప్రశాంత వాతావరణం...

పాతరోజులు మరోమారు మేఘాల గుంపులా వచ్చి వాటేసుకున్నాయి. తడిసిన గుండెని అదుముకుంటూ వెళ్లి, వాటి మధ్య వినమ్రంగా బాసింపట్టు వేసుక్కూర్చున్నాడు రామశేషం.

మొత్తానికి మేనల్లుడి జీవితం కళామతల్లికి అంకితమయిపోయింది. ఏ మలుపులూ లేకుండా స్వేచ్ఛా ప్రవాహంలా సాగిపోతోంది. సంగీత విద్వాంసుల మనుగడలోని ఎత్తుపల్లాల గురించి అతడికి కొద్దో గొప్పో తెలుసు. ఒకసారి శంకరాభరణం శంకరశాస్త్రి జీవితంలోకి తొంగిచూస్తే చాలు – కష్టభూయిష్ట జీవన ప్రయాణం ఆవిష్కృతమవుతుంది.

ఖ్యాతి ఉంటుంది – హుందాతనం ఉంటుంది. కాని చక్కటి మాన్యం ఉండదు. జీవించడానికి పిడికెడంతటిపట్టు. కచేరీలకు అవకాశం సంపాదించడానికి సంగీత కళాకారులు ఎన్ని పాట్లు పడాలో! ఒకసారి అవకాశం చిక్కితే మళ్లీ అదే సంగీత సభలో మళ్లీ కచేరీ చేయడానికి కనీసం ఆరునెలలయినా పడుతుంది. ఇంతకూ దొరికేదెంత? రాలిన వేరుశెనక్కాయలంత!

వాస్తవానికి పార్వతీశం బ్రిలియంట్ స్టూడెంట్. మినహాయింపనేది లేకుండా ప్రతిసారీ క్లాస్ ఫస్ట్ వస్తుండేవాడు. అవార్డులు – రివార్డులూ తీసుకుంటుండేవాడు. అలా తెలివితేటలతో అలరారే మేనల్లుడు అటు టెక్నికల్ ఫీల్డ్‌లోకో లేక ఇటు సివిల్ సర్వీస్ ప్రాంగణంలోకో దూసుకువెళ్తాడనుకున్నాడు. కానీ పార్వతీశం తన భావోద్వేగ చిత్త ప్రవృత్తికే పెద్దపీట వేసి, ఊహించని రీతిలో కనుమరుగయ్యాడు. పాత ప్రపంచానికి చేరువయ్యాడు. ఇక యిటు తిరిగి చూస్తే వత్సల క్షిపణిలా కెరీర్‌లో ఎదిగిపోయింది. ఆకాశ వీధిన జ్వాలలా మెరిసిపోయింది. ఇక పార్వతీశానికి అందనంత దూరం జరిగిపోయింది.

రాత్రి భోజనాలయిన తర్వాత భార్యాభర్తలిద్ద

రూ చాలాసేపు నారాయణి రాక కోసం ఎదురు చూసారు. ఆమె రాలేదు. వత్సల పెళ్లి ఊసు ఎత్తలేదు. కొన్నిసార్లు నిశ్శబ్దం ధ్వనికంటే హుం దాగా, హోరుగా భావవ్యక్తీకరణ చేస్తుంది. తన వైపు నుంచి కదలికకు ఎదురుచూస్తోందేమో! అంచేత డొంకతిరుగుడెందుకని వాళ్లు తిన్నగా వత్సల వద్ద పెళ్లి సంగతి కదిపారు. వత్సల ఆశ్చ ర్యంగా చూసింది. ఆ ఊసు మొదటిసారి వింటున్నట్టు. చదువు సంధ్యలున్న అమ్మాయి కాబట్టి తానొవ్వక, నొప్పింపక అన్న చందాన విషయాన్ని దాటవేసింది. సీను నుంచి తప్పు కుంది.

భార్యాభర్తలిద్దరూ మరుసటి రాత్రి కూడా సమాలోచనలు జరిపారు. బామ్మర్ది బ్రతికున్న రోజుల్లో అంటే కూతురు కళ్లు పూర్తిగా విచ్చు కోక ముందు పిల్లలిద్దరి పెళ్లిసంగతీ ముచ్చటిం చి ఉండొచ్చుగాక. ఇప్పుడు వాళ్లు పెద్దవాళ్ల య్యారు. దారులు కూడా వేరయ్యాయి. కాబట్టి - ఎలాగూ నెలరోజుల సెలవుపైన వచ్చారు కాబట్టి, పార్వతీశానికి యిక్కడే సంబంధం చూసి యింటివాణ్ణి చేస్తే సరిపోలా! ఎటొచ్చీ మేనల్లుడి జీవిత విధానానికి మంచి సంబంధం దొరక్కపోవచ్చు. తగిన సంబంధం దొరక్కుండా పోదు కదా!

"వంతెన రానియ్యి... అప్పుడు దానినెలా దాటాలో ఆలోచించవచ్చు" ఇద్దరూ ఆత్మ సమ ర్థనలోకి దిగారు.

* * *

ముందే రూపొందించిన ప్రణాళిక ప్రకారం రామశేషం కుటుంబసమేతంగా చెల్లిని కూడా వెంటబెట్టుకొని తిరుపతి చేరాడు. మొదటిరోజు అక్కడే ఓ రెంటల్ క్యాబ్ మాట్లాడుకొని క్రింది తిరుపతి చుట్టు ప్రక్కలున్న పుణ్యస్థలాలను దర్శించారు. గోవిందరాజుల వారి ఆలయంలో పూజా పునస్కారాలు జరిపించారు.

రెండవరోజు ఉదయం తిరుమలవెళ్లి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. అదే రోజు సాయంత్రం క్రింది తిరుపతి చేరుకొని, కాసేపు సేదదీర్చుకొ ని, మరునాడు ఉదయం హైదరాబాద్ ప్రయా ణానికి సామానులు సర్దుకోనారంభించారు.

చాలా రోజుల తరువాత నారాయణికి పట్ట రాని ఆనందం కలిగింది. మొదటిసారి జీవితం పరిపూర్ణత సంతరించుకున్నట్టు భక్తిపారవశ్యా నికి లోనయింది. అలవికాని తన్మయత్వం పొం దింది. శ్రీవారి దర్శనం ఎన్నిజన్మల పుణ్యఫల మో కదా అనుకుంటూ!

అలా అందరూ వాళ్లవాళ్ల సామాన్లను ప్యాక్ చేయడంలో మునిగిపోయినప్పుడు రూమ్‌బోయ్ తెచ్చిచ్చిన కాఫీకప్పు అందుకొని, కొంచెం కొం చెంగా చప్పరిస్తూ టీపాయ్‌పైన పడున్న దినపత్రి కను చేతిలోకి తీసుకున్నాడు రామశేషం. అది తిరుపతి ఎడిషన్. క్రింది భాగాన ఉన్న ప్రకటన చూసి అతడి కళ్లు పెద్దవయ్యాయి.

"నారాయణీ! ఓసారి ఇలారా!" గట్టిగా పిలి చాడు. నారాయణి ఉన్నదున్నట్టు "ఏమిట్రా అన్నయ్యా?" అంటూ పరిగెత్తుకొచ్చింది. "ఎప్పు డో వస్తాడనుకున్న నీ గారాలపట్టి యిప్పుడిక్కడే ఉన్నాడు నారాయణీ!"

"ఎవరి గురించిరా అన్నయ్యా నువ్వంటున్న ది?"

"ఇంకా అర్థం కాలేదా? పార్వతీశం యిప్పు డు తిరుపతిలోనే ఉన్నాడు.

ఆమె నిరుత్తురురాలై నిల్చుంది నమ్మలేనట్టు.

"అక్కడి ప్రోగ్రామ్ ముగించుకొని తిరుపతి చేరాడేమో! అదంతా తరువాత మాట్లాడుకుం దాం ముందు అందరూ తెమలండి. మంచి

సంగీత కచేరీ ఉంది” అన్నాడు రామశేషం.

* * *

వాళ్లక్కడికి చేరుకునేటప్పటికి తాళ్లపాకవారి సభామండపం సంగీతాభిమానులతో కిటకిటలాడుతోంది. ఇక జాప్యానికి తావివ్వకుండా హాలు చివరివేపున కూర్చొని, వెంట తెచ్చుకున్న వాటర్ బాటిల్ నుండి రెండు గుటకలుమ్రింగి, సావకాశంగా వేదిక వెనుక వ్రేలాడుతున్న ఫ్లెక్స్‌బ్యానర్ వైపు చూసాడు రామశేషం. అప్పుడుగానీ అతడికి తెలిసిందికాదు – తను పత్రికలోని ప్రకటన సరిగా చూడలేదని, ఆరోజు అక్కడ జరగబోయేది సంగీత కచేరీ కాదు కంచి కామకోటిపీఠం వారిచే బిరుదాంకితుడైన పార్వతీశానికి జరిగే సన్మానసభ – పౌరసన్మాన సభ అని.

తన మేనల్లుడు సాంప్రదాయ సంగీత సామ్రాజ్యంలో అంత ఎత్తుకు ఎదిగిపోయాడా? నమ్మశక్యం కానట్టు రామశేషం ముడుచుకు కూర్చున్నాడు. నారాయణి అసలు విషయం తెలుసుకొని ఆశ్చర్యంతో గుండెలపైన చేతులుంచుకుంది. ఎదుగూ బొదుగూ లేని సంపాదనతో చితికిపోతాడనుకున్న కొడుకు ఇంతమంది పెద్దలచేత సత్కారం పొందడమా? ఇప్పుడిదంతా చూసిన అన్నావదినలకు పార్వతీశంపైన గురి కుదురుతుందేమో! ప్రయోజకుడైన బావను చూసి వత్సల కూడా ఒప్పుకుంటుందేమో!

మొదట సంగీత విశారద శ్రీ గున్న గోవింద రాజులుగారు వేదికపైన కూర్చున్న పార్వతీశానికి గండపెండేరం తొడిగారు. సంగీతసాగర శ్రీ రామాంజనేయులుగారు పార్వతీశాన్ని కౌగలించుకొని పూలమాలవేసి, శాలువా కప్పారు. స్త్రీ బృందం వారు వచ్చి హారతి తీసి, నుదుట బొట్టుపెట్టి, పూలజల్లు కురిపించారు.

ఈ లోపల సభాసదులందరూ ఒక్కసారిగా లేచి కరతాళధ్వనులు చేయసాగారు. అదేమిటో అర్థంకాక రామశేషం కూడా లేచి నిల్చుని చప్పట్లు కొట్టారు. సభ అలా ఉత్తుంగ తరంగంలా లేవడానికి ఓ కారణం తిరుమల తిరుపతి దేవస్థానం వారి తరుపున ప్రత్యేకాధికారి వచ్చి పార్వతీశానికి నగదు బహూకరించి, గజమాలను సమర్పించి ఓ ముఖ్య ప్రకటన చేసాడు. ప్రభుత్వం వారు పార్వతీశాన్ని ఆస్థాన విద్వాంసుడుగా నియమించినట్టు ప్రకటించారు ఆ ప్రత్యేకాధికారి.

అంతా అయిన తర్వాత పార్వతీశం చివరిగా మాట్లాడాడు. తన సత్కారానికి నాంది పలికిన సంగీత సభకు కృతజ్ఞతలు తెలుపుకొని, తనకు విద్యనేర్పిన గురువులందర్నీ పేరుపేరునా గుర్తుతెచ్చుకొని – నమస్కరించుకొని – కడపటిగా తనను కని, పెంచి పెద్దచేసిన తల్లికి – తనను, తన తల్లినీ కష్టకాలంలో ఆదుకొన్న మేనమామకి, మేనత్తకీ నమస్కారాలు చెప్పి ముగించాడు.

కొడుకులోని ఆ ఉదాత్తగుణానికి నారాయణి రెండు కళ్లూ రెండు కొలనులయ్యాయి. పార్వతీశం తండ్రిగాని బ్రతికుంటే ఎంత సంతోషించునో!

సభానిర్వాహకులు ముందస్తుగానే సభాస్థలిని ఆక్రమించి పార్వతీశానికి చుట్టూ వలయంగా జరిగి జన ప్రవాహాన్ని రెండు పాయలుగా విడదీసారు... సన్మానిత సంగీత విద్వాన్ కాళ్లకు ఎవరూ అడ్డం రాకూడదని సంకేతం యిస్తూ.

అప్పుడు... వత్సల జనసందోహానికి ఎదురుగా వచ్చి ఈదుకుంటూ బావకెదురుగా కనిపించాలని ప్రయత్నించింది. కాని జనం ఆమెను వెనక్కి నెట్టేసారు. ఆమె మళ్లీ నిలద్రొక్కుకుంటూ ముందుకు వచ్చింది. అంతటి తొక్కిసలాట

లోనూ ఓ యువతి పార్వతీశాన్ని అంటిపెట్టుకొని, నవ్వు ముఖంతో నడిచివస్తోంది. అప్పుడు వెనుకనుండి ఎవరిదో గొంతు వినిపించింది. "చూడముచ్చటైన జంట. ఎందుకు చెప్పడం గానీ... ఆ పిల్ల నిజంగా అదృష్టవంతురాలే!"

"ఎలా?" ఇంకెవరిదో గొంతు అడిగింది.

"కాకపోతే - అంతగొప్ప సరస్వతీ పుత్రుడు ఆమెకు జీవిత భాగస్వామిగా కుదరటమా?"

"భలేవారండీ బాబూ! సగం తెలిసి, సగం తెలియకుండా మాట్లాడకూడదు. ఆమె వంటి గొప్ప వంశస్థురాలిని భాగస్వామిగా చేసుకోగలగడానికి మన సంగీత రత్నాకర బిరుదాంకితుడే భాగ్యవంతుడంటాను. ఎందుకంటారా..? ఆమె మామూలు కుటుంబం నుంచి వచ్చినదికాదు. ఆమె తాతగారు మైసూరు దర్బారులో ఆస్థాన విద్వాంసుడు. తండ్రిగారేమో సంగీత భాస్కర బిరుదాంకితుడు. పరమపదించేవరకూ తిరుమల తిరుపతి ఆస్థాన విద్వాంసునిగా ఉన్నారు. ఇంతకూ ఆమెవరో తెలుసా మీకు?"

"వింటున్నాగా - చెప్తూ వెళ్లండి"

"జాయింట్ కలెక్టరు హోదాలో ఉన్న ఐ.ఏ.ఎస్. ఆఫీసరు. దగ్గరి సంబంధాలు కాళ్లకడ్డం పడుతున్నా ఈ మహాశయుడి కోసం కాసుక్కూర్చుంది. ఎందుకంటారా? అదీ చెప్తాను వినండి... మైసూర్ విశ్వవిద్యాలయంలో సాంప్రదాయ సంగీత సౌరభాలన్న థీసిస్‌పై డాక్టరేట్ చేస్తున్నాడీయన. మరి అదయితేనేగానీ మూడు ముళ్లూ కట్టనని భీష్మించుక్కూర్చున్నాడు. అయినా ఆమె యిష్టపడి చేరువయింది ఇతగాడు సంపాదించిన బిరుదుల్ని చూసి కాదు కదా! ఆమె మనసా వాచా కర్మణా ఆరాధించేది ఇతన్లో శయనిస్తూన్న సంగీత సరస్వతిని చూసే కదా!"

ఎట్టకేలకు పార్వతీశం అల్లంత దూరం నుంచి తల్లిని చూసి పరిగెత్తాడు. "అమ్మా! నువ్వా! ఇక్కడా?" తడిసిన కళ్లతో నారాయణి తలూపుతూ ప్రక్కకు చూడమని చూపు మరల్చింది - వంగి పాదాలకు మొక్కుతున్న కొడుకుని లేవనెత్తుతూ. పార్వతీశం మరింత ఆశ్చర్యానికి లోనవుతూ... "ఈసారి మీరు రారనుకున్నాను మామయ్యా!" అంటూ రామశేషానికి, మనోహరికీ తలవంచి నమస్కరించాడు. ఆ తరువాత అటు తిరిగి తన ప్రక్కనే నిల్చున్న వేదవతిని పరిచయం చేయడానికి నోరుతెరిచారు. ఆమె కొడుకుని వారించింది - తనకంతా తెలుసన్నట్టు తలాడిస్తూ - కాబోయే కోడలు పిల్లని ఆశీర్వదిస్తూ.

"జెను మామయ్యా వత్సల కనిపించదేం... రాలేదా?" అంటూ కలయజూసాడు పార్వతీశం.

నెట్టుకుపోతున్న జనసందోహం మధ్య వత్సల పార్వతీశానికి కనిపించడం లేదు. "బావా నేనిక్కడున్నాను!" అన్న ఆమె గొంతు కూడా గాలి తెరల్లో కలిసిపోయింది. మరింత దూరంగా వెళ్లిపోయింది. ●

## మీకు తెలుసా?

టి.వి. వీక్షణం నానాటికీ పెరుగుతోంది. వందలాది ఛానల్స్, వేలాది కార్యక్రమాలు... ప్రజల్ని టి.వి. వైపు ఆకర్షిస్తున్నాయి. ఒకవైపు టి.వి.ని, అందులో వచ్చే కార్యక్రమాలనూ తిట్టుకొంటూనే తలతిప్పకుండా టి.వి. చూసేస్తున్నాం. చిన్న పిల్లలు కూడా కళ్లజోళ్లు పెట్టుకుని తిరుగుతున్నారంటే కొంతవరకూ అది టి.వి. మహిమే. టి.వి. వీక్షణం కళ్లకే కాక ఒంటికి కూడా మంచిది కాదు. టి.వి. చూస్తూ గడిపినప్పటి కంటే నిద్ర పోయేటపుడే ఎక్కువ కాలరీలు ఖర్చవుతాయట...!?